క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతం

పెడన:మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన సెషన్‌లో 63 మందికి 60 మంది హాజరవ్వగా ముగ్గురు అబ్సెంట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 64 మందికి 58 మంది హాజరవ్వగా ఆరుగురు అబ్సెంట్ అయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మచిలీపట్నంఅర్బన్: మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఈ నెల 11వ తేదీ జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న బీసీ సమరభేరి నిరసన విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరావు పిలుపునిచ్చారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బీసీ సమరం గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ డిమాండ్ చేశారు. నియోజకవర్గ అధ్యక్షులు సొడాడ బాలాజీ, నియోజకవర్గం అధ్యక్షులు కాశీవిశ్వేశ్వరరావు తదితరులున్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

భోగిరెడ్డిపల్లి (మచిలీపట్నం రూరల్): బాబూ జగ్జీవన్‌రామ్‌ని ఆదర్శంగా తీసుకోవాలని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రాంజీ అన్నారు. యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. శ్రావణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయములో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోదెలోకి పల్టీ కొట్టగా అందులో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రకాశం జిల్లా ఒంగోలు నుంచి పశ్చిమగోదావరి జిల్లా రాజోలు వెళుతున్న కారు గ్రామ శివారులో ఉన్న డివైడర్‌ను తప్పుకునే ప్రయత్నంలో అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకువెళ్లింది. పంట బోదె ఉండటంతో కారు అందులో ఇరుక్కుని ఆగిపోవడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. బోదె లేకపోతే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు పేర్కొన్నారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఘంటసాల:పేకాట, కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. దాలిపర్రు గ్రామంలో గురువారం రాత్రి పేకాటాడుతున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీకి విశ్వసనీయ సమాచారం అందిందని చెప్పారు. దీంతో డీఎస్పీ స్పెషల్ టీమ్, ఘంటసాల పోలీసులు శిబిరంపై మెరుపుదాడి చేసి 9 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,240 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కారు ఢీకొని గేదె మృతి

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు శివారు కంచడం రోడ్డు వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గేదె మృతి చెందింది. పెందుర్రు గ్రామం నుంచి బందరు వైపు వెళుతున్న కారు గేదెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

కూటమి నాయకుల్లో తీవ్ర అసంతృప్తి

పెడన:పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి భీముని అనంతలక్ష్మికి దక్కడంతో పెడన, గూడూరు మండలాల్లోని కూటమి నాయకుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉరివి గ్రామానికి చెందిన ఆమె మచిలీపట్నంలో సెటిల్ అయ్యారు. అయితే పొలాలు ఉరివి గ్రామంలో ఉండటంతో ఈమెకు జనసేన కోటాలో ఓసీ మహిళా విభాగంలో పదవి దక్కిందని అనుకుంటున్నారు. ఈ పదవిని ఆశించిన వారిలో ఎవరికో ఒకరికి దక్కుతుందనుకుంటున్న తరుణంలో కొత్తవారి పేరు ఖరారు చేయడంపై ఆయా పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం

రేపు శోభాయాత్ర

మచిలీపట్నంటౌన్: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆదివారం పలు హిందూ సంస్థల ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్ర (బైక్‌ర్యాలీ) నిర్వహిస్తామని శ్రీరామ శోభాయాత్ర కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ రోజు హిందూ కళాశాల నుంచి ఈ శోభాయాత్ర ప్రారంభమై నగరంలోని ప్రధాన రహదారుల గుండా ముందుకు సాగుతుందన్నారు. హిందూ బంధువులందరూ కుటుంబ సమేతంగా హాజరై జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

నిర్వహణ లోపం.. ప్రజలకు శాపం..

- నక్రమంగా నడవని 108 అంబులెన్స్‌లు
- మరమ్మతులతో ఎక్కడబడితే అక్కడ ఆగిపోతున్న వైనం
- అవస్థలు పడుతున్న రోగులు



వాహనానికి మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం



రోడ్డు పక్కన ఆందోళనలో రోగి, బంధువులు



చల్లపల్లి 108 వాహనం

మచిలీపట్నంరూరల్: అత్యవసరమైన 108 అంబులెన్స్‌ల నిర్వహణ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రజలకు శాపంగా మారింది. ఆపద సమయంలో ఆదుకునేందుకు ఎంతగానో దోహదపడాల్సిన వాహనాలు సేవలు అందించలేకపోతున్నాయి. అనారోగ్యాలతోనే, ప్రమాదాల సమయంలోనో ఎమర్జెన్సీగా ఆస్పత్రులకు వెళ్లాలంటే సకాలంలో 108 వాహనాలు బాధితుల వద్దకు రావాలి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వాహనాల నిర్వహణ పట్టించుకోకపోవడంతో రోగులకు ప్రాణసంకటంగా మారింది. ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వాహనాలు ఆగిపోవడంతో అంబులెన్స్‌లో ఉండే రోగులు, వారి బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సకాలంలో ఆస్పత్రులకు వెళ్లకపోతే ప్రాణాలు దక్కే పరిస్థితులు కన్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

మచిలీపట్నంలో ఇలా...

నడిరోడ్డుపై 108 వాహనం నిలిచిపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడిన సంఘటన గురువారం మచిలీపట్నం - అవనిగడ్డ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఘంటసాల మండలం దేవరకోట గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బాధితుడు కొడాలి నాంచారయ్య జ్వరంతో గత మూడు రోజులుగా ఇబ్బందులు పడుతూ ఘంటసాలలోని ఓ ప్రైవేటు వైద్యుని వద్ద వైద్యం చేయించుకున్నాడు. గురువారం ఉదయం తీవ్ర జ్వరం ఎక్కువై వాంతులు అవ్వటంతో కుటుంబీకులు 108కు ఫోన్ చేయగా సమయానికి వచ్చినప్పటికీ మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మచిలీపట్నం - అవనిగడ్డ జాతీయ రహదారి కృష్ణారావుపేట సమీపంలో వాహనం టైర్ పంక్చర్ కావటంతో నిలిచిపోయింది. దీంతో వాహనంలో ఉన్న రోగులు, బంధువులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కిందకు దిగి రోడ్డు పక్కనే రోగిని పట్టుకుని కుటుంబీకులు నిస్సహాయ స్థితిలో నిలిచిఉన్నారు. ఆసుపత్రికి వెళ్లాల్సిన వారు వాహనం నిలిచిపోవటంతో ఏం చేయాలో దిక్కుతోచక మండుటెండలో అలా పడిగాపులు పడ్డారు. ప్రత్యామ్నాయంగా ప్రైవేటు వాహనంలో వెళదామనుకున్నా వారి ఆర్థిక స్థోమత లేకపోవటంతో వాహనం టైరు మార్చే వరకు అక్కడే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 108 వాహనాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నార్థకంగా చల్లపల్లి 108 సేవలు..!

చల్లపల్లి: అత్యవసర పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన 108 వాహనం సేవలు ప్రశ్నార్థకంగా మారాయి. దట్టమైన నల్లని పొగను వదులుతూ ధూమ శకటంగా మారి వాహనంలోని రోగులకు, రోడ్డుపై రాకపోకలు సాగించేవారికి ఊపిరి ఆడకుండా ఉక్కిరి బిక్కిరి చేస్తూ స్వచ్ఛమైన వాతావరణాన్ని కూడా కలుషితం చేస్తూ మసకబారుస్తోంది. 108 ఆపరేటర్ నుంచి కాల్ వేస్తే చాలు పైలెట్లు భయపడుతున్నారు. తరచూ బండి స్టార్ట్ కాక మొరాయించటంతో దాన్ని తోసేందుకు ఎప్పటికప్పుడు రోడ్డున పోయే నలుగురిని బతిమలాడాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని నెలల కిందట 108 అధికారులు దాదాపు అన్ని మండలాలకు కొత్త వాహనాలు ఇచ్చి చల్లపల్లికి మాత్రం పాత 108 వాహనాన్నే ఉంచేశారు. ఎందుకు అలా ఉంచారన్నది ఎవరికీ అర్థంకాని ప్రశ్నగా మారింది. మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 53 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. చల్లపల్లికి ఆనుకుని జాతీయ రహదారితో పాటు ప్రధాన నగరాలకు వెళ్లేందుకు చుట్టూ రహదారులు ఉన్నాయి.

ప్రభుత్వానికి నివేదించాం

108 వాహనాల్లో పనిచేసే పైలెట్లు సొంతంగా గానీ, ఇతర ప్రైవేటు అంబులెన్సులు గానీ నడపటానికి అనుమతి లేదు. అలా ఎవరైనా చేస్తే చర్యలు తీసుకుంటాం. చల్లపల్లికి కొత్త 108 వాహనం అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదించాం.

–హరీష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, 108 అంబులెన్స్ సర్వీస్

అనునిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు వస్తూ ఉండటంతో అత్యాధునికమైన 108 వాహనం ఈ ప్రాంతానికి ఎంతైనా అవసరం ఉంది. స్థానిక 108 వాహనం 4 లక్షల కిలోమీటర్లకు పైగా తిరిగి ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. 108 వాహనం నడిపే వారిలో కొందరికి సొంత అంబులెన్స్‌లు ఉన్నట్లు సమాచారం. వారి అంబులెన్స్‌లు నడపటం కోసం అధికారులతో కుమ్మక్కై కొత్త 108 వాహనం రాకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

పెండింగ్ ఫైళ్లను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి కలెక్టరేట్‌లోని సెక్షన్ సూపరింటెండెంట్లతో శుక్రవారం ఆయన సమీక్షించారు. కారుణ్య నియామకాలు, భూ సంబంధిత సమస్యలు, మీ కోసం అర్జీలు, సిబ్బంది ఫిర్యాదులు, పదోన్నతులు తదితర అంశాలకు సంబంధించిన ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఇ–ఆఫీసు ద్వారానే ఫైళ్లను నిర్వహించాలని సూచించారు. ఇకపై ప్రతినెలా పెండింగ్ ఫైళ్లపై సమీక్షిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో కె చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో వీరాంజనేయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పెడన:నియోజకవర్గంలో ఇద్దరికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో అందజేశారు. పట్టణంలోని అగస్తీశ్వరాపురనికి చెందిన రౌతుల రాఘవమ్మకు రూ.81,101, గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన బొడ్డు బాల మల్లేశ్వరికి రూ.2,56,000 చెక్కులను ఇచ్చారు. కుటుంబసభ్యులు ఆ చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను ప్రోత్సహిస్తే ఉన్నత స్థితి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



చాంపియన్ ట్రోఫీని లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న బుద్ధప్రసాద్

కోడూరు: చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను ప్రోత్సహిస్తే ఉన్నత స్థితికి చేరుకుంటారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ప్రాంగణంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాలోత్సవ్-2025 వేడుకలు అంబరాన్నంటాయి. ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావుల అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో బుద్ధప్రసాద్ మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా లేని స్థాయిలో కోడూరు మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ కలిసి గత ఏడు సంవత్సరాల నుంచి బాలోత్సవాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఏ కార్యక్రమం చేపట్టినా కోడూరు మండల విద్యాశాఖ తమవంతు సహాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. గతంలో సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం చేపట్టిన సమయంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడూరు మండలం మొదటి స్థానంలో ఉన్న విషయన్ని గుర్తు చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల్లో సత్తాచాటిన ఎంపీపీఎస్ స్వతంత్రపురం, ఎంపీపీఎస్ ముందడుగు, ఎంపీపీఎస్ సాలెంపాలెం మెయిన్, లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందాలను ప్రత్యేకంగా అభినందించి, ట్రోఫీలు అందించారు. సమగ్ర శిక్షణ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఫణి ధూర్జటి, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ప్రాజెక్టు కమిటీ తూర్పు కృష్ణ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, గ్రీన్‌స్టోన్ ఇన్‌ఫ్రా ఇండియా కంపెనీ అధినేత అప్పికట్ల పాపారావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఎస్ఐ చాణిక్య తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేపై అవగాహన ర్యాలీ

అన్నవరం(మోపిదేవి): ప్రభుత్వం నూతనంగా చేపట్టిన భూ రీ సర్వే ప్రాజెక్టుకు ప్రజలంతా సహకరించాలని తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. మండలంలోని వెంకటాపురం శివారు అన్నవరం గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ తుమ్మా సోములమ్మ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ రీ సర్వే వల్ల రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. సర్వేకు ముందస్తుగా అధికారులు ఆయా రైతులకు తెలియచేస్తారని చెప్పారు. దూరప్రాంతాల్లో ఉన్న స్థానికులకు కూడా గ్రామస్తులు తెలియచేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్లే కార్డులతో ర్యాలీ నిర్వహించారు. డీటీ వాణి, ఇన్‌చార్జి ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు ప్రసాద్, వేణు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వయ్యారిభామ హానికరమైన కలుపుమొక్క

కెవీకే ఘంటసాల సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి



వయ్యారి భామ కలుపు మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

రావివారిపాలెం(మోపిదేవి): వయ్యారిభామ హానికరమైన కలుపుమొక్క అని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి. సుధారాణి తెలిపారు. మండలంలోని రావివారిపాలెంలో జాతీయ సేవా పథకంలో బాగంగా శుక్రవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్నా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ వయ్యారి భామ కలుపు మొక్క దిగుబడిని తగ్గించడంతో పాటు మానవ ఆరోగ్య సమస్యలు కలిగించడం వంటివి చేస్తుందని తెలిపారు. పెరట్లో పెరుగుతున్న వయ్యారి భామ కలుపుమొక్క చేతులతో తొలగించాలని, పొలాల్లో పెరిగే కలుపుమొక్కను తగిన మందులు పిచికారీ చేసి తొలగించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని గ్రంథాలయం చుట్టూ ఉన్న వయ్యారి భామ కలుపు మొక్కలను బాపట్ల కళాశాల విద్యార్థులు తొలగించారు. అంతకుముందు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ డాక్టర్ ఎం సంధ్య, ప్రిన్సిపాల్ రిప్రజెంటేటివ్ డాక్టర్ బి.అపర్ణ, డాక్టర్ ఎం.సంధ్య ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం వివరించారు. ఏడీ ప్రతినిధి డాక్టర్ బి.అపర్ణ, డాక్టర్ బి.నవీన్, ఎస్ఎంఎస్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ మంజువాణి, ఎస్ఎంఎస్ హార్టికల్చర్ తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందించారు. విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు కంఠంనేని కుటుంబరావు, అభ్యుదయ రైతు జొన్నలగడ్డ పిచ్చేశ్వరావు, కోటేశ్వరావు, చిన పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల స్టాక్ పాయింట్ పరిశీలన

పెడన: విద్యార్థి మిత్ర కిట్ల మండల స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు జి.మహేశ్వర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. స్థానిక బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఉండాల్సిన సౌకర్యాలు పరిశీలించి పలు వివరాలను మండల స్థాయి విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కేవీఎం-1) స్టూడెంట్ కిట్ల మండల స్టాక్ పాయింట్‌లు ఎలా ఉన్నాయో పరిశీలించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎస్ఆర్‌కేవీఎంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు, బ్యాగ్, బెల్టు, బూట్లు, డిక్షనరీలు, నోటు పుస్తకాలు ఉచితంగా అందిస్తామని చెప్పారు. ఈయనతో పాటు సమగ్ర శిక్ష కృష్ణ జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ రమేష్, పెడన ఎంఈవో-2 వై హరనాథ్, ఆర్పీలున్నారు.

సబ్సిడీ రుణాలకు 7, 8 తేదీల్లో ఇంటర్వ్యూలు

మచిలీపట్నంరూరల్: సబ్సిడీ రుణాల మంజూరుకు ఈ నెల 7, 8 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో చీపురుపల్లి వెంకటేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని పంచాయతీలు నుంచి సబ్సిడీ లోన్లకు అర్జీలు సమర్పించిన వారికి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఏడవ తేదీన బీసీ అన్ని కులాలకు చెందిన వారికి, ఎనిమిదో తేదీన ఓసీలకు ఇంటర్వ్యూలుంటాయన్నారు.

7న బీసీ కార్పొరేషన్ వారికి ఇంటర్వ్యూలు

పెడన:పెడన మండలంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి ఈ నెల 7వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పెడన ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

మోపిదేవి: వివిధ కేటగిరీల్లో కార్పొరేషన్స్ ద్వారా బ్యాంకులు అందించే రుణాలపై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 476 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 416 మంది అభ్యర్థులు హాజరయినట్లు ఎంపీడీవో స్వర్ణభారతి తెలిపారు. మొత్తం 59 యూనిట్లు ఉండగా మోపిదేవి నుంచి ఎస్‌బీఐ, కెనరా, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, పెదకళ్లేపల్లి, చల్లపల్లి నుంచి ఇండియన్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కోడూరు: బీసీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ కింద రుణాల కోసం దరఖాస్తు చేస్తున్న లబ్ధిదారులకు ఈ నెల 7,8 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ శుక్రవారం తెలిపారు. 7న కోడూరు, లింగారెడ్డిపాలెం, మందపాకల, సాలెంపాలెం, జయపురం, హంసలదీవి, 8న మాచవరం, పిట్టల్లంక, పోటుమీద, రామకృష్ణాపురం, ఉల్లిపాలెం, విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం పంచాయతీల పరిధిలోని లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు.

గూడూరు:బీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న అర్జీ దారులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో బి.రాజేశ్వరి ఆధ్వర్యంలో గూడూరు ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ మాధవి, పోలవరం ఇండియన్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వరరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 635 మంది దరఖాస్తు దారులకు గాను 400 మంది హాజరైనట్లు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు.

జగ్జీవన్‌రామ్ జయంతిని జయప్రదం చేయండి

మచిలీపట్నంటౌన్: జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా గుప్తా సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద శనివారం నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనంద్‌బాబు (జానీ) కోరారు. నగరంలోని భాస్కరపురంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్ నివాసంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో దళిత వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు అర్పించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, మాజీ పీపీ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నార్త్ అధ్యక్షుడు మట్టా నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నష్టం కలిగించే సంస్కరణలు నిలిపివేయాలి



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అవనిగడ్డ:విద్యారంగానికి నష్టం చేకూర్చే సంస్కరణలు నిలిపివేయాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయనను కలిసిన యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, జిల్లా సహాయ కార్యదర్శులు బీజీ గోపాలకృష్ణ, ఎస్.వెంకటేశ్వరరావుతో పాటు మరికొంతమంది కలసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు శ్రీకాంత్‌తో పాటు అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యం

అవనిగడ్డ: స్థానిక విద్యానికేతన్ వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకంది. రిటైర్డ్ కలెక్టర్ బి. లక్ష్మీకాంతం దంపతులు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు హాజరై ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం లక్ష్మీకాంతం మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని చెప్పారు. విద్యానికేతన్ కరస్పాండెంట్ లంకమ్మ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ దంపతులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన

చల్లపల్లి: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు కేవీవీ ప్రసాద్ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ వనజాక్షికి అందించారు. మహిళా సమాఖ్య జిల్లా నాయకులు మల్లుపెద్ది రత్నకుమారి, జ్యోత్స్నదేవి, నాగేంద్రమ్మ, సీపీఐ జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, రైతు సంఘం నేత సురేంద్రనాథ్‌బెనర్జీ, బోసుతో తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

గోగినేనిపాలెం(ఘంటసాల): బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని సర్పంచ్ కుంపటి సుశీల అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాలికల సంరక్షణ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ సుశీల మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలు అరికట్టాలని చెప్పారు. హెచ్‌ఎం టి.వి. జి.రావు, మహిళా పోలీస్ జి.అంకాలు, అంగన్‌వాడీ కార్యకర్త సునీత, కృష్ణ కుమారి, ఝాన్సీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

కోడూరులో అంబరాన్నంటిన బాలోత్సవ్ వేడుకలు



వేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులు



శివతాండవ నృత్యం చేస్తున్న దృశ్యం

కోడూరు: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవ్-2025 వేడుకలు అంబరాన్నంటాయి. మండలంలోని 40 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా ప్రదర్శనలిచ్చారు. దేశభక్తిగీతాలు, జానపద నృత్యాలు, గిరిజన నృత్యాలు, సినిమా పాటలకు విద్యార్థులు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో చేసిన పలు డ్యాన్స్‌లు అబ్బురపర్చాయి. పలువురు చిన్నారులు తెలుగుతల్లి, భరతమాత, సుభాష్‌చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, రుద్రమదేవి, పలు దేవతామూర్తుల వేషధారణలో అలరించారు. విద్యార్థులు త్రివర్ణ పతకాలు, శిరస్సుపై దీపాలు పెట్టుకుని కుండలపై చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గురుకుల ప్రవేశ పరీక్ష 13కు వాయిదా

పెడన:మండల పరిధిలోని బల్లిపర్రు డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష ఆరో తేదీ నుంచి 13వ తేదీకి వాయిదా పడినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.రూతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును విద్యార్థులు గమనించాలని సూచించారు. 13వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి వారికి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్‌లో ప్రవేశం వారికి పరీక్ష ఉంటుందని ఆమె వెల్లడించారు. ఈ మార్పును విద్యార్థులు గమనించి అందుకు అనుగుణంగా హాజరుకావాల్సిందిగా ఆమె సూచించారు. హాల్ టికెట్లను హెచ్‌టీటీపీఎస్//ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వైబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా కోరారు.

మలబార్ షోరూంలో బంగారం చోరీ

కోనేరుసెంటర్: మచిలీపట్నంలోని మలబార్ గోల్డ్ షోరూంలో చోరీ ఘటనపై ఆర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఏసుబాబు తెలిపిన వివరాల మేరకు.... గురువారం సాయంత్రం గుర్తు తెలియని ఓ వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి ఆభరణాలు కొనుగోలు చేసే వారిలా షోరూంలో కాసేపు తిరిగాడు. అనంతరం ఆభరణాలు కొనుగోలు చేయకుండా వెళ్లిపోయాడు. షోరూం మూసే ముందు సిబ్బంది ఆ రోజు జరిగిన వ్యాపార లావాదేవీలు చూస్తుండగా 31 గ్రాముల బంగారం తేడా వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన సిబ్బంది షోరూంలోని సీపీ పుటేజీలను పరిశీలించగా 31 గ్రాముల బంగారు కడియం అపహరించినట్లు తేలింది. షోరూం మేనేజర్ తాడి గంగరాజు ఆర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు షోరూంలో సీసీ పుటేజీలను పరిశీలించారు. చోరీకి పాల్పడిన అజ్ఞాత వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు సీఐ ఏసుబాబు తెలిపారు.

సబ్‌జైల్ తనిఖీ



సబ్‌జైల్‌ని సందర్శించిన జూనియర్ సివిల్‌జడ్జి

అవనిగడ్డ: స్థానిక సబ్‌జైల్‌ని జూనియర్ సివిల్ జడ్జి లంకా గోపీనాథ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడి వసతులు గురించి తెలుసుకున్నారు. ఖైదీలు ఉండే గదులు, వంటగదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలర్, సిబ్బంది పాల్గొన్నారు.